ఆలయంలో పూజలు



ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

కుత్బుల్లాపూర్ : జీడిమెట్ల డివిజన్ పేట్ బషీరాబాద్ కట్ట మైసమ్మ ఆలయంలో మంగళవారం వివిధ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్ రెడ్డి, శైలజ రెడ్డి దంపతులు, ఎన్‌సీఎల్ నార్త్ కాలనీ చెందిన కృష్ణ రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు.

వార్షిక పూజలు



హోమంలో పాల్గొన్న భక్తులు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ శ్రీనివాస్ నగర్‌లోని శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అరుణ్ గురు స్వామి, బ్రహ్మశ్రీ రాజన్ నంబూద్రి గురుస్వామి, ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ప్రధాన అర్చకులు నాగార్జున ఆచార్యులు (లాలు స్వామి), కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వార్షిక వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ ప్రణయధనరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

పగలూ వెలుగులే!



జీడిమెట్ల: రాత్రిపూట వెలగాల్సిన వీధిదీపాలు పగలు సైతం వెలుగుతూనే ఉన్నాయి. వీధి దీపాలు స్విచ్‌ను ఆఫ్ చేయాల్సిన సిబ్బంది అసలు విషయం మరిచిపోతున్నారు. దాదాపు సుభాష్‌నగర్‌లోని చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు స్విచ్‌లు ఆఫ్ చేయడం లేదు. ఇప్పటికైనా విద్యుత్ సిబ్బంది ప్రతిరోజు ఉదయం వీధిదీపాల స్విచ్‌ను ఆఫ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కొంపల్లి మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం కొంపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో స్థానిక అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ సమస్య, నత్తనడకన కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు, శానిటేషన్ తదితర సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్ల కాలంలో గ్రేటర్ హైదరాబాద్ నగరానికి దీటుగా శివారు మున్సిపాలిటీలైనా కొంపల్లి, దుండిగల్, నిజాంపేట్ కార్పొరేషన్ ప్రాంతాలు గణనీయంగా అభివృద్ధి చెందాయన్నారు. కొంపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ముందుంచేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో కొంపల్లి మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ చంద్రమోహన్‌రెడ్డి, కమిషనర్ కృష్ణారెడ్డి, మేడ్చల్ ఏసీపీ వెంకట్ రెడ్డి, అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌చార్జి సీఐ హనుమాన్‌గౌడ్, ఇంజినీరింగ్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

బస్సు సర్వీస్‌ను పొడిగించాలని వినతి

నిజాంపేట్ : జేఎన్‌టీయూహెచ్ నుంచి నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీ మీదుగా గండిమైసమ్మ వరకు ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను పొడిగించాలని ఎమ్మెల్యే వివేకానంద్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం నివాస్ జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ తన్నీరు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కర్ల లాలయ్య, జనరల్ సెక్రటరీ కొలెపాక వెంకట్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వరకు ప్రారంభించిన సర్వీస్‌లను గండిమైసమ్మ చౌరస్తా వరకు కొనసాగిస్తే మరింత ఉపయోగంగా ఉంటుందని అన్నారు. ఈ మార్గంలోనే సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీ, ఇంజినీరింగ్ కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు ఉన్నాయని, చుట్టుపక్కల కొత్తగా ఎన్నో కాలనీలు, బస్తీలు ఏర్పడ్డాయన్నారు. కుత్బుల్లాపూర్ మండల కార్యాలయానికి వివిధ పనులపై వెళ్లాలంటే సరైన రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా బోనాలు సమీపిస్తున్న దృష్ట్యా జర్నలిస్ట్ కాలనీలో చెర్ల ఎల్లమ్మ దేవాలయానికి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

తాత్కాలిక బస్ షెల్టర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

రంగారెడ్డినగర్: రెండేళ్లుగా ప్రయాణికులు పడ్డ ఇబ్బందులకు ఉపశమనం కలిగింది. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ బస్‌షెల్టర్‌ను ఆధునీకరణ పేరుతో రెండేళ్ల క్రితం అధికారులు తొలగించారు. దీంతో బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులు ఎండలో నిలుచోలేక, వానలో తడుస్తూ నానా అగచాట్లు పడ్డారు. బస్తీ సంక్షేమ సంఘం సభ్యులు సైతం ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఈ విషయమై 'సాక్షి'లో పలుమార్లు కథనాలు ప్రచురితం అయ్యాయి. ఈ క్రమంలో జీడిమెట్ల డిపో అధికారులు, జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయ అధికారులు ఇటీవల కొలతలు తీసుకుని తాత్కాలిక షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. త్వరలోనే శాశ్వత ప్రాతిపదికన షెల్టర్ నిర్మాణం చేపట్టనున్నారు. ఎట్టకేలకు తాత్కాలిక బస్‌షెల్టర్ అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గాంధీనగర్ బస్టాప్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్

బస్టాపా?.. పార్కింగ్ స్థలమా?



జగద్గిరిగుట్ట: శ్రీనివాస్ నగర్ మీ సేవా కేంద్రం వద్ద బస్టాప్‌లో కొంత కాలంగా కారును పార్కింగ్ చేస్తున్నారు. నిర్మించిన పార్కింగ్ టైల్స్‌పైకి తీసుకొని వెళ్లి పార్కింగ్ చేయడం విశేషం. ప్రయాణికులు కూర్చోడానికి వీలు లేకుండా కారు పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

దుండిగల్: ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని భౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి యాదగిరితో కలిసి ఆయన 50 శాతం సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలను రైతులకు అందజేశారు. భౌరంపేట, దుండిగల్ సెంటర్లలో మొత్తం 14.8 క్వింటాల జనుము, 5 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో వ్యవసాయ అధికారిని సంప్రదించి పర్మిట్ తీసుకుంటే అదే రోజు విత్తనాలను అందిస్తామన్నారు. రూ.5,020 విలువ చూసే 40 కేజీల జనుము బస్తాను రూ.2,510కు, అదే విధంగా రూ.4275 విలువ చేసే 30 కేజీల జీలుగ బస్తాను రూ.2137.50కు రైతులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టరు భీమ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రైతులు అమరేందర్‌రెడ్డి, వీరారెడ్డి, సర్సారెడ్డి, ఈశ్వరయ్య, భరత్‌రెడ్డి, భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.



సబ్సిడీ విత్తనాలను అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, ఏఓ యాదగిరి

పొగాకు ఉత్పత్తుల దుష్ఫలితాలపై అవగాహన

సుభాష్‌నగర్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మల్లారెడ్డి డెంటల్ సైన్సెస్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూరారంలోని కళాశాల ప్రాంగణం నుంచి షాపూర్‌నగర్ వరకు వైద్యులు మొబైల్ డెంటల్ వ్యాన్ ద్వారా పొగాకుకు సంబంధించిన హానికర ప్రభావాలను వీడియోల ద్వారా ప్రజలకు వివరించారు. అదే విధంగా షాపూర్‌నగర్‌లోని దుకాణదారులకు, వీధి వ్యాపారులకు చిన్న గ్రూపుల రూపంలో విద్యా కార్యక్రమం నిర్వహించారు. పొగాకును వాడుతున్న వారితో ఈ అలవాటు మానుకుంటామని సంతకం తీసుకుని ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ పరపా సజ్జన్‌గారి నేతృత్వంలో నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో 15 మంది డాక్టర్ల బృందం పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న వైద్య సిబ్బంది

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కుత్బుల్లాపూర్: పట్టణ సమైక్య సమావేశం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. గత నెలలో జరిగిన లావాదేవీలతో పాటు తీర్మానాలు, ప్రభుత్వ పథకాలపై చర్చించారు. మహిళా గ్రూపులు తీసుకున్న రుణాలు, వసూళ్లపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత మహిళా గ్రూపులపై ఉందని పేర్కొన్నారు. అదే విధంగా ఎనిమిది సంవత్సరాలుగా ఒకే గ్రూప్ సభ్యులు అధ్యక్ష, కార్యదర్శులుగా కొనసాగడం పై చర్చ జరిగింది.

నెహ్రూకు ఘన నివాళి

జీడిమెట్ల: భారతదేశాన్ని అభివృద్ధి వైపు తీసుకువెళ్లిన వ్యక్తి భారత మొదటి ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ అని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు గొల్లజాన్ అన్నారు. మంగళవారం నెహ్రూ వర్ధంతి సందర్భంగా గాజులరామారంలోని కేర్ అండ్ లవ్ అనాథ ఆశ్రమంలో పిల్లలతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ప్రధాన రోడ్డుపై వరదనీరు



రంగారెడ్డినగర్: ప్రధాన రహదారులపై వరదనీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట– ఐడీపీఎల్ రోడ్డులోని రంగారెడ్డి నగర్ బస్టాప్ సమీపంలో వర్షపు నీరు చేరుతోంది. వరద వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో రోజుల తరబడి నీరు నిలుస్తోంది. అంతే కాకుండా బురద పేరుకుపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.